క్లుప్తంగా

ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకం

ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య



శావల్యాపురం: మధ్యాహ్న భోజన పథకం అమలులో ప్రధానోపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య సూచించారు. మండలంలోని కొత్తలూరు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను మండల స్థాయి అధికారులు శుక్రవారం సందర్శించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న వసతులు పేద విద్యార్థులకు పారదర్శకంగా అందేలా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును విద్యార్థుల సామర్థ్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయనతో పాటు ఎంఈవో మద్దికుంట సాంబశివరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 33 అర్జీల స్వీకారం

నాదెండ్ల: తూబాడు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం రెవిన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ఏవీ రమణ, డీటీ ధనలక్ష్మీ, సర్వేయర్ రాంబాబు పాల్గొని రైతుల నుంచి 33 అర్జీలు స్వీకరించారు. రీసర్వేలో భూముల కొలతల్లో తేడాలు నమోదయ్యాయంటూ రైతులు అర్జీలు అందించారు. అర్జీలను త్వరలో పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వీఆర్వో శ్రీధర్‌బాబు, సర్వేయర్ అబ్దుల్‌బాషా ఉన్నారు.

టైరు పంక్చరై... కారు ధ్వంసమై..



నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం వద్ద ముందు వెళ్తున్న కారుకు పంక్చర్ కావటంతో వెనుక వస్తున్న కంటెయినర్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో కారు ధ్వంసమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నెల్లూరు నుంచి విజయవాడ వెళ్తున్న క్రమంలో గణపవరం వద్దకు రాగానే టైరు పంక్చరైంది. దీంతో కారు అదుపుతప్పి డివైడర్ వైపునకు రావటంతో వెనుక నుంచి చెన్నై నుండి విజయవాడ వెళ్తున్న మెడిసిన్ లోడు లారీ ఢీకొంది. దీంతో కారు రోడ్డుకు అడ్డుగా తిరిగి ధ్వంసమైంది. ఎస్సై పుల్లారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించండి



వినుకొండ(నూజెండ్ల): రాష్ట్రంలోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పనిచేస్తున్న వైద్య మిత్రలు ఈ నెల 29వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయాలని రాష్ట్ర యూనియన్ నిర్ణయించడం జరిగిందని రాష్ట్ర ఆరోగ్య మిత్రల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాచర్ల బుజ్జి, కాకాని అప్పారావు, దీనిలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ డిమాండ్లను హెల్త్ మినిస్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సింగంశెట్టి వెంకటేశ్వర్లు, నాగలక్ష్మి, మహేశ్వరి, హనుమంతరావు, హరిబాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుగా సుజాత



శావల్యాపురం: మండలం నూతన తహసీల్దారుగా కె.సుజాత జిల్లా కలెక్టరు ఉత్తర్వులు మేరకు శుక్రవారం నియమాకం అయారు. ఇప్పటి వరకు బాపట్ల జిల్లాలో తహసీల్దారుగా ఆమె విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. ఈనెల 28న బాధ్యతలు స్వీకరిస్తారు. గతంలో కరోనా సమయంలో తహసీల్దారుగా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు ఎఫ్ఏసీ తహసీల్దారుగా డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు అదనపు బాధ్యతలు నిర్వహించారు.

11 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

నాదెండ్ల: యడ్లపాడు మండలం కారుచోల గ్రామంలో పేకాటాడుతున్నారన్న సమాచారంతో ఎస్సై బాలకృష్ణ సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాటాడుతున్న పదకొండు మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.32,590లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై బాలకృష్ణ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

> 'శిలలపై శిల్పాలు చెక్కినారు / మన వాళ్లు సృష్టికే అందాలు తెచ్చినారు / కనుచూపు కరువైన వారికైనా / కనిపించి కనువిందు కలిగించు రీతిగా' అని ఓ మనసు కవి ఆశువుగా శ్రీకృష్ణదేవరాయల నిర్మాణాలపై కట్టిన పదాల వరుసలు. అదేరీతిగా ఇనప్పాలెంలోని మహంకాళీ అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు సాగుతున్నాయి. పూర్తిగా రాతికట్టడంతో అమ్మకు ఆలయాన్ని నిర్మించేందుకు శిల్పులు అహర్నిశలు శ్రమిస్తున్నారు.



పూర్తయిన ఉపపీఠం పనులు



దేవాలయ నిర్మాణంలో ఉపపీఠం ఇదే..



ఉపపీఠానికి తుదిమెరుగులు దిద్దుతున్న శిల్పి



ఆలయ గర్భగుడి నిర్మాణ పనులు ఇలా...

నరసరావుపేట రూరల్: మహిమాన్విత క్షేత్రం ఇసప్పాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. 1976లో నిర్మాణం జరుపుకున్న ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. భక్తుల రద్దీ పెరగడం, ఆలయం చిన్నదిగా ఉండటంతో భక్తులకు అసౌకర్యంగా మారింది. గర్భగుడి శ్లాబ్ పెచ్చులు కూడా ఊడి పడుతుండటంతో ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

రాతితో ఆలయ నిర్మాణం..

ఆలయ నిర్మాణాన్ని పూర్తిగా రాతికట్టడంతో చేపడుతున్నారు. తూర్పు గోదావరికి చెందిన శిల్పి కర్రి శ్రీనివాసరావు నిర్మాణ పనులు చేపట్టారు. తమిళనాడులోని మహాబలిపురం, రామేశ్వరం, కుప్పం ప్రాంతాల నుంచి 15 మంది శిల్పులు నిర్మాణ పనుల్లో పాల్గొంటున్నారు. ప్రస్తుతం ఫౌండేషన్ పనులు పూర్తయ్యాయి. ప్రదక్షణ మండపానికి ఉపపీఠం పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఆలయానికి మూడు వైపులా ఉప పీఠం పూర్తిచేశారు. రాతి స్తంభాలను తీసుకువచ్చే క్రేన్ రాకపోకలు సాగించేందుకు నాల్గవ వైపు ప్రస్తుతం ఈ పనులు నిలిపివేశారు. అలాగే గర్భాలయం నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు. అనంతరం ప్రధాన ఆలయంలోని ప్రదక్షణ మండపం, అంతరాలయం నిర్మాణాన్ని చేపట్టనున్నారు. జిల్లాలో ఏక్కడా లేని విధంగా ఆలయ నిర్మాణాన్ని పూర్తిగా ద్రావిడ సాంప్రదాయంలో నిర్మిస్తున్నారు. వెయ్యి సంవత్సరాల నాటి శిల్పకళను ప్రతిబింబించేలా నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఆలయ నిర్మాణంలో ప్రధానంగా 38 రాతి స్తంభాలను ఏర్పాటుచేస్తున్నారు. సాధారణ ఆలయాలకు భిన్నంగా ఉండే విధంగా మూల స్తంభాలు-12, సింహ స్తంభాలు-20, సూర్య క్రాంతి స్తంభాలు-12, మండవ స్తంభాలు-4తో నిర్మాణాలను చేపడుతున్నారు.

- రూ.5.5 కోట్లతో ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణం
- 'మహా'ద్భుతంగా ఆలయ నిర్మాణం
- రూ.97 లక్షలు సీజీఎఫ్ నిధులు
- ఆలయ నిర్మాణానికి రూ.1.5 కోట్ల దాతల సహకారం
- గర్భాలయ నిర్మాణ పనుల్లో శిల్పులు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఆధ్వర్యంలో నాడు పనులు ప్రారంభం

రూ.5.5 కోట్ల అంచనాలతో పనులు

ఆలయ పునర్నిర్మాణ పనులను దాదాపు రూ.5.5 కోట్ల అంచనాలతో పనులు 2023 డిసెంబర్‌లో ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కృషితో దాదాపు రూ.97 లక్షల నిధులను కామన్ గుడ్ ఫండ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో పాటు ఆలయ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. వీరి ద్వారా దాతల నుంచి విరాళాలు స్వీకరించి పనులు ప్రారంభించారు. దాదాపు రూ.1.5 కోట్లు దాతలు ఆలయ నిర్మాణానికి అందజేశారు.

దాతల సహకారం వల్లే...

ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అధిష్ఠానం పనులు జరుగుతున్నాయి. ఉపపీఠం పనులు పూర్తయ్యాయి. గత ఐదు నెలలుగా పనుల్లో కొంత జాప్యం జరిగింది. పది రోజుల నుంచి పనులు ప్రారంభించాం. దాతల సహకారంతో ఆలయ పునర్నిర్మాణాన్ని పూర్తిచేస్తాం.

మాధవీదేవి,
ఈవో, ఇస్సప్పాలెం ఆలయం

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు జొన్నలగడ్డ విద్యార్థులు



జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లిఖార్జునరావు

నరసరావుపేట రూరల్: జొన్నలగడ్డ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికై నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లిఖార్జున రావు శుక్రవారం తెలిపారు. నాదెండ్ల మండలం గణపవరం జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 24వ తేదీన నిర్వహించిన జిల్లా సైక్లింగ్ జట్టు ఎంపిక పోటీలలో పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. అండర్-14 విభాగంలో ఎస్.లావణ్య, అండర్-17 విభాగంలో ఎం.బిందు పూర్ణిమ, జె.రిబ్కారాణి, ఎం.శశికుమార్ ఎంపికైన వారిలో ఉన్నారని వివరించారు. అలాగే సత్తెనపల్లి ప్రగతి కాలేజీలో నిర్వహించిన అండర్-19 ఎంపిక పోటీలలో బి.వి జయలక్ష్మీ, జె.దేవప్రసన్న కుమార్, పి.జాన్‌లు ఎంపికైనట్టు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈనెల 26,27, 28 తేదీలలో ఎన్టీఆర్ జిల్లానున్నలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఐ.సునీల్, ఉపాధ్యాయులు అభినందించారు.

చకచకా స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటు



శావల్యాపురంలో స్మార్ట్ మీటరు గురించి వివరిస్తున్న దృశ్యం

శావల్యాపురం: ప్రీపెయిడ్ స్మార్ట్ విద్యుత్ మీటర్ల కేటగిరి-2 వ్యాపార సముదాయాల్లో అమర్చే పనులు జరుగుతున్నట్లు మండల విద్యుత్‌శాఖాధికారి జవ్వాజీ నటరాజ్ తెలిపారు. శుక్రవారం స్థానిక విద్యుత్ ఉప కేంద్రంలో ఏఈ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు తొలివిడతలో ప్రభుత్వ కార్యాలయాలు, వీధిలైట్లు, కేటగిరి-2లో ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్ల స్థానంలో నూతన ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు 525 స్మార్ట్ మీటర్ల మంజూరు కాగా శావల్యాపురంలో 212 మీటర్ల అమర్చే పనులు జరుగుతున్నాయన్నారు. ఆధునికీకరణ సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్ మీటర్ల తయారు చేసినట్లు తెలిపారు. సెల్‌ఫోనులో మాదిరిగానే రీచార్జ్ చేసుకుంటేనే విద్యుత్ సరఫరా అవుతుందని బ్యాలెన్స్ అయిపోగానే విద్యుత్ వెలుగులు ఉండవన్నారు. గృహాలకు కూడా స్మార్ట్ విద్యుత్ మీటర్ల అమర్చే పనులు నూరుశాతం పూర్తి కాగానే ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు నూతన విధానం అమల్లోకి వస్తుందన్నారు. అప్పటి వరకు బిల్లు విధానం అమలులో ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రొంపిచర్ల: మండల కేంద్రానికి సమీపంలోని శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వేపై శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మునుమాక గ్రామానికి చెందిన టైలర్ పలుకూరి శ్రీనివాసరావు (36) అక్కడికక్కడే మృతి చెందాడు. హైదరాబాద్ వైపు నుంచి ఒంగోలు వైపు వెళుతున్న కారు ద్విచక్ర వాహనంపై మార్కెట్ యార్డ్ సమీపంలోని హైవే రోడ్డును దాటుతున్న శ్రీనివాసరావును ఢీకొంది. సంఘటన జరిగిన వెంటనే పారిపోతున్న కారు, డ్రైవర్‌ను పోలీసులు చేజ్‌చేసి అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణ పరిధిలోని సింగ్‌నగర్, సాంబశివనగర్ పరిసర ప్రాంతాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దీంతో పాటు చిలకలూరిపేట మండల పరిధిలోని పసుమర్రు సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా పసుమర్రులో విద్యుత్ సరఫరా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉండదన్నారు.

ఉచిత వైద్యశిబిరం

నాదెండ్ల: గణపవరం సీఆర్ కళాశాల ఆవరణలో శుక్ర వారం చిలకలూరిపేట ప్రముఖ చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ రాజేష్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 60 మంది విద్యార్థులకు జుట్టు, చర్మ సంబంధిత వ్యాధులు, వాటిపై అవగాహన, నివారణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు చుండి రంగనాయకులు మనవడు రంగ నాయకులు, ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య, లైబ్రేరియన్ నిరంజన్, పీడీ ఐ.నాగేంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ రాజేష్‌ను శాలువాలతో సత్కరించారు.

తాగునీటిని కాచివడపోసి తాగండి

నరసరావుపేట: పురపాలక సంఘం సరఫరా చేస్తున్న తాగునీటిని ప్రతిరోజూ కాచి వడపోసి తాగాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ప్రజలు అందరికీ సరఫరా చేస్తున్నామన్నారు. దాచేపల్లిలో డయేరియాతో ఇద్దరు మృతి చెందినందున ముందుజాగ్రత్త చర్యగా తాగునీరు కాచివడపోసి తాగాలని విజ్ఞప్తి చేశారు.

రైతులకు అవగాహన

నాదెండ్ల: అటవీయేతర ప్రాంతాల్లో చెట్ల పెంపకంపై శుక్రవారం యడ్లపాడు మండలం కారుచోల, కొండవీడు గ్రామాల్లో ప్రోగ్రాం సీసీ వెంకటేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానవన మొక్కలు, అడవిజాతి చెట్లను పొలాల్లో నాటి సంరక్షిస్తే లభించే అదనపు ఆదాయం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు తన పొలంలో, పొలం గట్లపై చెట్లను పెంచాలన్నారు.

ఓటు నమోదు చేసుకోండి

నరసరావుపేట: కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమం నవంబర్ ఆరవ తేదీ వరకు మాత్రమే గడువు ఉన్నందున పట్టణ, గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు తమ ఓటును చేర్చుకొని పార్టీకి అండగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలు అందరూ ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఉధృతంగా చేపట్టాలని, గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ప్రతిరోజు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే ఆది వారం ఈ కార్యక్రమం పార్టీ కార్యాలయంలో పెద్దఎత్తున చేపట్టనున్నామని, ప్రతిరోజు దీని నిమిత్తం సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉంటారని అన్నారు.

అవగాహన ర్యాలీ

బొల్లాపల్లి : రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే ప్రపంచ పోలియో డే అవగాహన ర్యాలీ, మానవహారం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొల్లాపల్లి ఎంఈవో -2 కె. పార్వతి మాట్లాడుతూ ప్రజలు పోలియో రహిత జీవితం గడపాలని రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు.

పొగాకు రహిత సమాజమే లక్ష్యం

నాదెండ్ల: అమీన్‌సాహెబ్‌పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేసానుపల్లి ఎంఏఎం ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో టుబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ -2.0 నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఏఎం కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, ప్రిన్సిపల్ ఎం.ప్రసాదరావు మాట్లాడుతూ, యువత ప్రాథమిక లక్ష్యం హానికరమైన పొగాకుకు దూరంగా ఉండాలన్నారు. పొగాకు ఆరోగ్యంపై ఎలాంటి దుష్ప్రభావాలు చూపుతుందో అవగాహన కల్పించారు.

ఏటీఎం ఏర్పాటుకు ట్రయల్ రన్



శావల్యాపురం: ఎస్‌బీఐ శావల్యాపురం బ్యాంకు శాఖ సారథ్యంలో ఏర్పాటు చేసిన ఏటీయం సెంటరు త్వరలో ప్రారంభిస్తున్నట్లు ఎస్‌బీఐ బ్యాంకు మేనేజరు వలేటి ప్రసాదు తెలిపారు. శుక్రవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో మాట్లాడుతూ గతంలో ఏర్పాటు చేసిన ఏటీయం సెంటరు సాంకేతిక సమస్య కారణంగా కొన్ని నెలలుగా పనిచేయకపోవటం చేత నిరుపయోగంగా మారింది. దీంతో ఖాతాదారులు ఫిర్యాదుల మేరకు ఆధునిక యంత్ర పరికరాలు ఏర్పాటు చేసి ట్రయల్ రన్ ప్రయత్నాలు చేయగా విజయవంతం అయినట్లు తెలిపారు. అలాగే బ్యాంకు పరిధిలో రెండవ కస్టమర్ సరీ్వసు సెంటరు సీహెచ్.త్రివేణికు మంజూరు కాగా త్వరలో ప్రారంభిస్తామన్నారు.

పోలీసులు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

నరసరావుపేట: పోలీస్ అమరవీరుల స్మారకోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శుక్రవారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు పాఠశాలలు, కళాశాలలో విద్యార్థిని విద్యార్థులు, పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సైబర్ క్రైమ్ నేరాలు-నియంత్రణలో యువత పాత్ర, ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశాలపై నిర్వహించిన ఈ పోటీలకు విద్యార్థులు, పోలీసు సిబ్బంది ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థిని, విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీయటంతో పాటు పోలీస్ శాఖపై పూర్తిస్థాయిలో అవగాహన, మంచి దృక్పథం, స్ఫూర్తి కల్పించే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రస్తుత సమాజంలో సైబర్ క్రైం నేరాలు జరుగుతున్న తరుణంలో వాటిని నియంత్రించేందుకు యువత అప్రమత్తంగా ఉండి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా తన జీవితాలు కాపాడుకోవాలని, సమాజ శ్రేయస్సు, భద్రత కోసం పోలీసులు అందిస్తున్న సేవలు, త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసుల సేవలు, దైనందిన విధులు, త్యాగాల పట్ల అవగాహన చేసుకోవడం, గుర్తించడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు.

ఆర్ఎస్‌కే సిబ్బందికి నైపుణ్య పెంపుదలపై శిక్షణ



మాట్లాడుతున్న శివకుమారి

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ సబ్ డివిజన్ రైతు సేవా కేంద్రం సిబ్బందికి నైపుణ్య పెంపుదలపై శిక్షణా కార్యక్రమం పట్టణంలోని మార్కెట్ యార్డులో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా శిక్షణా కోఆర్డినేటర్ ఎం. శివకుమారి మాట్లాడుతూ వరిలో చీడపీడల యాజమాన్యం గురించి వివరిస్తూ మన ప్రాంతంలో ఆకుముడత, దోమ పోటు ఆశించే అవకాశం ఉందని, ఆర్థిక నష్ట పరిమితి స్థాయిని బట్టి దోమ నివారణకు డైనోటేఫ్యూరాన్ లేదా బూప్రొఫెజిన్ లేదా ట్రైఫ్లూమెజోపైరిన్ వాడాలన్నారు. ఆకుముడత నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ వాడాలన్నారు. రబీ మొక్కజొన్నలో సమగ్ర పోషక యాజమాన్యంలో భాగంగా జీవన ఎరువులు, 100 కిలోల నత్రజని, 35 కిలోల భాస్వరం, 35 కిలోల పొటాష్ వాడాలని తెలిపారు. వివిధ పంటలలో వాడాల్సిన జీవన ఎరువుల గురించి తెలిపారు. ఉద్యాన శాఖాధికారి రసూల్ మాట్లాడుతూ మిరపలో యాజమాన్య పద్ధతులు, ఉద్యాన శాఖలో అమలవుతున్న పథకాల గురించి వివరించారు. వినుకొండ, ఈపూరు, బొల్లాపల్లి, నూజెండ్ల మండల వ్యవసాయ శాఖ అధికారులు పంటల బీమా, వ్యవసాయ శాఖలో ఇతర పథకాల గురించి అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో మొబైల్ రంగంలో వ్యాపార, ఉపాధి అవకాశాలు

షియాగో సర్వీస్ హెడ్ బైరెడ్డి శివప్రసాదరెడ్డి



వర్క్‌షాప్‌నకు హాజరైన బైరెడ్డి శివ ప్రసాదరెడ్డి

నరసరావుపేట రూరల్: ఆటోమొబైల్ రంగంలో వ్యాపార, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని షియాగో సర్వీస్ హెడ్ బైరెడ్డి శివప్రసాదరెడ్డి తెలిపారు. జేఎన్‌టీయూఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానిక్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఆటోమొబైల్ వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌కు షియాగో సర్వీస్ ఏపీ, తెలంగాణ హెడ్ శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథిగాహాజరై ప్రసంగించారు. ఆటోమొబైల్ రంగంలో ఎలా స్థిరపడాలో విద్యార్థులకు తెలియజేశారు. ఆటోమోటీస్ పరిశ్రమలో మోటర్ వాహనాల రూపకల్పన, అభివృద్ధి, తయారీ, మార్కెటింగ్, విక్రయాలు, మరమ్మతులు వంటి అనేక రకాల కంపెనీలు, సంస్థలు ఉన్నాయని వివరించారు. ఆదాయ మార్గాల్లో ప్రపంచంలోనే అతి పెద్ద పరిశ్రమ ఆటోమోటీస్ అని తెలిపారు. మెకానికల్ అండ్ ఆటోమొబైల్ చదువుతున్న విద్యార్థులకు ఎన్నో ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. జీవితంలో చదువు ద్వారానే అన్ని నేర్చుకోలేరని, ప్రాక్టికల్‌గా సమాజం నుంచి కొంత నేర్చుకోవడం ద్వారా జీవితంలో రాణించవచ్చని సూచించారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఐఎస్ ఫణిసుష్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న రూరల్ ఎస్ఐ శశిప్రియాంక

నరసరావుపేట ఈస్ట్: యువతను నిర్వీర్యం చేసే మాదక ద్రవ్యాలు (డ్రగ్స్) పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ శశిప్రియాంక హితవు పలికారు. పల్నాడురోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ఐ శశిప్రియాంక మాట్లాడుతూ, మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని తెలిపారు.

డ్రగ్స్ సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియచేయాలని కోరారు. ఇటీవల గంజాయి విచ్చలవిడిగా లభిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో చోటు చేసుకుంటున్న పలు నేరాలు గంజాయి మత్తులోనే జరుగుతున్నాయని తెలిపారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ కాకాని సుధాకర్ అధ్యక్షత వహించిన సదస్సులో అధ్యాపకులు ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ దీప, డాక్టర్ నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

మున్సిపల్ కమిషనర్‌ను కోరిన బాధితులు, ప్రజాసంఘాల నాయకులు



కమిషనర్ జస్వంతరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, బాధితులు

నరసరావుపేట: పట్టణానికి చెందిన నక్కథామస్ అనే దళితుడికి ప్రభుత్వం ఇచ్చిన మూడు సెంట్ల స్థలాన్ని ఆక్రమించాలని చూస్తున్న మెడికల్ వ్యాపారులు బీవీ సత్యనారాయణ, కె.నాగరాధిక, వారికి సర్వే రిపోర్ట్ ఇచ్చిన మున్సిపల్ టౌన్ సర్వేయర్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన అనంతరం కమిషనర్ ఎం.జస్వంతరావుకు వినతిపత్రం అందజేశారు. పీడీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు శిఖనం చిన్న, సీఐటీయూ నాయకులు షేక్ సిలార్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నాదెండ్ల: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బోయపాలెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు సైబర్ నేరాల నియంత్రణలో యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పరిసరాల సంరక్షణలో పోలీసులకు ఎదురయ్యే సమస్యలపై పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్సై వి.బాలకృష్ణ పాల్గొన్నారు.

సమయ పాలన ముఖ్యం

నరసరావుపేటరూరల్: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి ఐ. మురళీ తెలిపారు. మండలంలోని దొండపాడు గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. హాజరు పట్టికను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు.